క్లుప్తంగా

ఆహ్వానం



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: రంజాన్ పర్వదినం సందర్భంగా నిరుపేద ముస్లింలకు ఆల్ మదత్ ఉమ్మతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని టీవైఆర్ గార్డెన్‌లో బుధవారం జరిగే ఈ కార్యక్రమానికి రావాలని మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అజర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరాకుల సాయి, సభ్యులు ముక్తార్, నవాజ్ తదితరులున్నారు.

మట్టి అక్రమ నిల్వలకు అడ్డుకట్ట వేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ములుగు(గజ్వేల్): మండలంలోని కొక్కొండ గ్రామ చెరువుకు ఆనుకొని ఉన్న భూమిలో కొందరు వ్యక్తులు చేపడుతున్న అక్రమ మట్టి నిల్వలకు అడ్డుకట్ట వేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ రైతులు మంగళవారం ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. చెరువులో ఎప్పుడూ సుమారు 6 నుంచి 7 ఫీట్ల ఎత్తులో నీరు నిల్వ ఉంటుందని, భూముల్లో మట్టిని నింపుతున్న కారణంగా వర్షాకాలంలో నీటి సామర్థ్యం తగ్గటంతో పాటు చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడుతుందని వారు ఆ వినతిలో పేర్కొన్నారు. చెరువుకు ఆనుకొని ఉన్న భూముల్లో మట్టిని నింపి కంపెనీలకు అనుగుణంగా మార్చుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు అడ్డుకొని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధిపై అత్యవసర సమావేశం

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ మహ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో మంగళవారం కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ యార్డు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఇటీవల మరణించిన పాతూరు గ్రామానికి చెందిన హమాలీ విజయ్ కుటుంబానికి కమిషన్ ఏజెంట్లు, హమాలీలు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల తోడ్పాటుతో రూ.1లక్ష 10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ జహంగీర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, సభ్యులు రాందాస్, కృష్ణమూర్తి, బాలయ్య, బాపురెడ్డి, తిరుపతినాయక్, మహాలక్ష్మి, కుమార్‌యాదవ్, ప్రవీణ్‌చారి, బాలమణి, సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, గణేష్, రామకృష్ణారెడ్డి, సర్పంచ్ హంస మహేశ్‌యాదవ్, కార్యదర్శి రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సౌమ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ద ప్రభుత్వ ఆస్పత్రులకు పంపిస్తున్నామన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రజిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- దౌల్తాబాద్ మండల సభలో ఎంపీపీ గంగాధరి సంధ్య
- రెవెన్యూ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

దుబ్బాక: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని దౌల్తాబాద్ ఎంపీపీ గంగాధరి సంధ్య అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగాధరి సంధ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా మండల కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్ రెవెన్యూ అధికారుల అవినీతితో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల పరిధిలో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని సర్పంచ్‌లు కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఏ సమావేశమైన అధికారికంగా సమాచారం ఇవ్వాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎంపీపీ సంధ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సంధ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రణం జ్యోతిశ్రీనివాస్‌గౌడ్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్‌కుమార్, ఎంపీఓ గఫూర్‌ఖాద్రి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బీటీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో రూ.4.5కోట్లతో నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సముచితంగా నిధులు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతటి త్యాగానికైన వెనుకాడేదిలేదన్నారు. మున్సిపాలిటీలో నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గానికి న్యాయపరంగా నిధులు మంజూరు చేయాలని లేకుంటే ప్రభుత్వ కక్షసాధింపు ధోరణిని ఎండగడుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బాలేషగౌడ్, ప్రవీణ్, నేహాల్, రమణారెడ్డి, రమేశ్‌రెడ్డి, సాయి తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా నిలపడమే ధ్యేయం

'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి



19వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న అధికారి ముత్యంరెడ్డి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ×గడా¤ (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రస్తుతం రూ.22.37కోట్ల వ్యయంతో సీసీరోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. రెండో దశలో అన్ని వార్డుల్లో వందశాతం సీసీరోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం మరోసారి వార్డుల వారీగా పరిశీలన జరుపుతామని తెలిపారు. తమ వార్డులో మట్టిరోడ్లు అధికంగా ఉన్నందున, రెండో దశలో పూర్తిస్థాయి సీసీరోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆ వార్డు బీఆర్ఎస్ నాయకులు గుంటుకు రాజు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. దుబ్బాక బస్టాండ్ వద్ద దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఆస స్వామి, పర్స కృష్ణ, బాలకిషన్‌గౌడ్, శ్రీకాంత్, ఆస యాదగిరి, బాలకృష్ణ, బత్తుల స్వామి, రాజమణి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, చంద్రయ్య తదితరులు ఉన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత

మహనీయుల పోరాట స్ఫూర్తితో సాగుదాం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: మహనీయుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని, బావితరాలకు వారి చరిత్ర తెలిసేలా పనిచేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. మహాత్మా జ్యోతీరావు పూలే 197వ జయంతి సందర్భంగా స్థానిక విపంచి ఆడిటోరియంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువు ద్వారా సమాన హక్కులు సాధ్యమని, అణిచివేతకు గురైన వర్గాలకు విద్య అందించడానికి పూలే జీవితాంతం పోరాటం చేశాడని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే దంపతులు పాటుపడ్డారన్నారు. పూలే దంపతుల ఆశయ సాధనకు సీఎం కేసీఆర్ భవిష్యత్ ప్రణాళికలు తయారుచేసి విద్య, సామాజిక పథకాల రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. విద్య ద్వారా ప్రతి ఒక్కటీ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, బీసీ సంక్షేమ శాఖ అధికారి మురళీ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు ఆనంద్, ఎల్లం, రఘురాం, నాయకులు బీమాసేన, రాములు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఉమామహేశ్వరాలయం ముస్తాబు



ముస్తాబైన ఆలయం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని అతి పురాతనమైన సీతారామ ఉమామహేశ్వరాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 12 నుంచి 17 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 12వ తేదీ బుధవారం స్వస్తివచనము, 13వ తేదీ గురువారం వాసుదేవ పుణ్యాహవచనము, అంకురార్పణ, 14వ తేదీ శుక్రవారం స్వామివారి ఎదుర్కోలు, రాత్రి 8 గంటలకు సీతారామ ఉమామహేశ్వర కల్యాణోత్సవం, 16వ తేదీ శనివారం అగ్ని గుండాలు, గరుడసేవ పట్టణ పురవీధుల్లో ఊరేగింపు, 17వ తేదీ ఆదివారం పుష్ప రథోత్సవం కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలనను నిర్వహించనున్నారు.

16న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10 తరగతి వరకు అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12గంటల వరకు 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుస్నాబాద్: పట్టణంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మున్సిపల్ కమిషనర్ సమక్షంలో మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. పట్టణంలోని కొత్త చెరువు శిఖం భూమిలో కొందరు అక్రమంగా కట్టడాలను నిర్మిస్తున్నారని పలువురు నాయకులు అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేయగా, ఆ కట్టడాలను కూల్చివేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు చెరువు శిఖం భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీలను పరిశీలించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమక్షంలో అక్రమ కట్టడాలను మున్సిపల్ సిబ్బందితో నేలమట్టం చేశారు. చెరువు శిఖం భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, అక్రమంగా నిర్మిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పాండురంగ ఆశ్రమం టు పండరీపురం పాదయాత్ర

మర్కూక్(గజ్వేల్): శ్రీ పాండురంగ ఆశ్రమం ఆవిర్భవించి 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ వేద పండితుడు అప్పల భవానందశర్మ, లక్కాకుల భానుప్రసాద్ మహారాష్ట్రలోని శ్రీ పండరీపురానికి పాదయాత్రగా బయలుదేరారు. నాదం పాదంలో భాగంగా 50 కోట్ల హరే రామ నామ జప యజ్ఞ పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 6 నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా భవానందశర్మ మాట్లాడుతూ.. 2024లో పాండురంగ ఆశ్రమంలో నిర్వహించే శతకోటి హరే రామ నామ మహా యజ్ఞానికి ప్రచారంగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామని భావానందశర్మ తెలిపారు. ఈ నెల 16న పండరీపురానికి చేరుకొని ఏకాదశి రోజు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాదయాత్ర ద్వారా పండరీపురానికి వెళ్లడం మా పూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ సందర్భంగా భావానందశర్మ సాయంత్రం ఆలయాల్లో బలచేస్తూ గ్రామస్తుల ఆదిత్యాన్ని స్వీకరిస్తున్నారు.

పూలే ఆశయాలను కొనసాగించాలి



దుబ్బాకటౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు



హుస్నాబాద్‌లో..



ములుగు(గజ్వేల్): నివాళులర్పిస్తున్న వీసీ నీరజప్రభాకర్, సిబ్బంది

దుబ్బాకటౌన్: బడుగు, బలహీనవర్గాల హక్కులు, మహిళల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..
మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో కమిషనర్ గణేష్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ములుగు(గజ్వేల్): ములుగులోని తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్.బి.నీరజప్రభాకర్, అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, గిర్‌వాణి, రాజశేఖర్, నటరాజన్‌శ్రీనివాసన్, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నకోడూరులో..



సిద్దిపేటలో..

హుస్నాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: మున్సిపాలిటీ కార్యాలయంలో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు



చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న నాయకులు

గౌరవెల్లిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాల కుట్ర

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించే గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నారని, ప్రాజెక్టును అడ్డుకునే వారు రైతు వ్యతిరేకులని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో 1వ వార్డు నుంచి 10వ వార్డులకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మా నాన్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు దేశం కోసం పోరాటం చేస్తే, తాను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడానని చెప్పారు. దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గౌరవెల్లి పూర్తి అవబోతుందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు పట్టణంలోని 4వ వార్డులో రూ.25లక్షల నిధులతో నిర్మించే సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్ సరికాదు**
కోహెడ(హుస్నాబాద్): వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోకుండా స్థానిక ఎస్‌బీఐ అధికారులు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజింగ్ చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. మంగళవారం విలేకరుతో ఆయన మాట్లాడుతూ.. తీగలకుంటపల్లికి చెందిన పెరుగు వెంకట్‌రెడ్డి, ధర్మసాగర్‌పల్లికి చెందిన దొమ్మాట తిరుపతిరెడ్డిలు బ్యాంక్‌లో క్రాఫ్‌లోన్లు తీసుకున్నట్లు చెప్పారు. ఇరువురి వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోకుండా బ్యాంక్ అధికారి క్రాఫ్ లోనుకు జమచేస్తామని బ్యాక్ ఖాతాను ఫ్రీజింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఖాతాను ఫ్రీజింగ్ తీయాలని అనేక సార్లుగా బ్యాంక్ అధికారికి మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వృద్ధులు ఇద్దరు ఆందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ జోక్యం చేసుకొని వృద్ధులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

◆ **దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ**
గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని గిరిపల్లి గ్రామంలో మంగళవారం జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బస్‌పాస్ జారీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గిరిపల్లి గ్రామంలో సుమారు 17 మంది దివ్యాంగులకు, అదే విధంగా రామారం, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో సైతం మరో 40మంది దివ్యాంగులకు ఉబస్‌పాస్‌లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిపల్లి సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, జీపీపీ డిపో సిబ్బంది స్వాతి, రాణి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**
చేర్యాల(సిద్దిపేట): ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కరుణాకర్ అన్నారు. మంగళవారం నాగపురి గ్రామంలో సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ సేవలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంతోషి, స్వప్న, కృష్ణవేణి, కార్యదర్శులు సందీప్, రాజు, రమేశ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం**
మద్దూరు(హుస్నాబాద్): నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన గుండె సునీల్‌కు మంజూరైన రూ.37,500ల చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు, ఎర్ర రాజయ్య, కిష్టయ్య, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

◆ **ఔదార్యం చాటిన స్నేహితులు**
బెజ్జంకి(సిద్దిపేట): బాల్యంలో కలిసి చదువుకొని ఇటీవల మరణించిన మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థికసాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. బెజ్జంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.60వేలు ఆర్థికసాయం అందించి చేయూతనందించారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీనివాస్, వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**
చేర్యాల(సిద్దిపేట): ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, బాలమోహన్, శ్రీనివాస్, మమత, ఆంజనేయులు పాల్గొన్నారు.

◆ **అంబేద్కర్ పుస్తకావిష్కరణ**
చేర్యాల(సిద్దిపేట): అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని వేచరేణి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.వి.ఎస్ రెడ్డి, సర్పంచ్ దుర్గయ్యతో కలసి అందరివాడు.. అంబేద్కర్ అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు ఉపాధ్యాయుడు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో 14 మంది విద్యార్థులు స్వీయ రచన చేశారన్నారు. కార్యక్రమంలో సరస్వతి, సంతోష్, బాలకవులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రజలపై గ్రామదేవతల ఆశీర్వచనాలు ఉండాలి**
గజ్వేల్‌రూరల్: ప్రజలపై గ్రామదేవతల ఆశీర్వచనాలు ఉండాలని కొండపోచమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ గోలి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం అనంతరావుపల్లిలో నిర్వహించనున్న దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు మంగళవారం రూ.11వేల 116లను సర్పంచ్ మహేందర్ యాదవ్‌కు విరాళంగా అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో తాను భాగస్వామవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **సమాచారం లేకుండా కంటి వెలుగు శిబిరం**
దుబ్బాకరూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం లేకుండా మండలంలోని పద్మశాలిగడ్డలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ ప్రారంభించారు. ఈ విషయంపై ఉపసర్పంచ్ మాధవిస్వామి ఎంపీడీఓ భాస్కరశర్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ విలేకరులతో మాట్లాడుతూ.. సర్పంచ్ బీజేపీకి చెందిన వ్యక్తి కావడంతో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీడీఓకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి అనే ఉద్దేశంతోనే సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధిర గ్రామమైన నర్లెంగడ్డలో శిబిరాన్ని ప్రారంభించాలని ఎంపీడీఓను కోరారు.

◆ **ఇంటింటికీ బీజేపీ కరపత్రం ఆవిష్కరణ**
మర్కూక్(గజ్వేల్): ప్రతి పల్లెకూ బీజేపీ చేసిన అభివృద్ధి పథకాలను తీసుకెళ్తామని బీజేపీ కార్యదర్శి రాములు అన్నారు. మంగళవారం మర్కూక్‌లో పల్లె పల్లెకూ ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మోర్చా మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు పాల్గొన్నారు.